విక్టోరియా మహారాజ్ఞి చరిత్రము

చెన్నపురి
సి. కుమారస్వామి నాయుఁడు సన్సు
1912

విక్టోరియా మహారాజ్ఞి చరిత్రము

మ హా రా జ్ఞి జ న న ము

ఇండియాదేశపుచక్రవర్తినియు ఇంగ్లండుదేశపు రాణియు రమారమి అఱువదినాల్గు సంవత్సరములు రాజ్యపరిపాలనము జేసి లోకమంతయు మహాప్రఖ్యాతి నొందినట్టియు, విక్టోరియాచక్రవర్తినిగారు, 1819వ సంవత్సరము మేనెల 24వ తేది. తెల్లవాఱుజామున 4 గంటలకు లండన్ పట్టణములోని కెన్‌సింగ్టన్ భవనమునందు జన్మించిరి.

విక్టోరియా పుట్టినవెంటనే ఇంగ్లండుదేశ ప్రజలందఱును ఆనంద మహోత్సవములు సల్పిరి. ఇంగ్లండును పరిపాలించుటకు మగబిడ్డ పుట్టలేదాయెనుకదా యనెడి చింత యున్నప్పటికిని, ఆఁడుబిడ్డ యైనను పుట్టినదికదా యని సంతసించిరి.

విక్టోరియా తండ్రిపేరు డ్యూక్ ఆఫ్ కెంటు. ఇతఁడు మూఁడవ జార్జిప్రభువుయొక్క నాలవ పుత్త్రుఁడు. వారి జ్యేష్ఠసోదరు లగు ముగ్వురలో నొకరికి సంతతిలేకయు, ఇరు

వురకు సంతతి కలిగియు నష్టమైనందువలనను, విక్టోరియా గారే పట్టాభిషిక్తురా లగునట్లు సంభవించెను. విక్టోరియా మహారాజ్ఞి తల్లిపేరు డచ్చెస్ ఆఫ్ కెంటు. ఈమెయొక్క గుణములు శ్లాఘనీయములు. బిడ్డలను సాఁకుటయందును చదువు నేర్పుటయందును వారికి సకల సద్గుణములును అలవడునట్లుగా చేయుటయందును, డచ్చెస్ ఆఫ్ కెంటు మిగుల సమర్థురాలు. ఆమె విక్టోరియాను సాఁకుచున్న పద్ధతినిబట్టియే ఆమెయొక్క సమర్థత యిట్టిదని తెలియఁగలదు.

1819వ సంవత్సరము, జూన్ నెల, 24వ తేది శిశువునకు అలెగ్జాండ్రినా విక్టోరియా అని పేరిడిరి. ఆసంవత్సరము ఆగష్టు నెల బిడ్డకు స్ఫోటకము పొడిపించిరి. అంతదనుక రాజ కుటుంబములో నెవ్వరును అమ్మ పొడిపించుకొనలేదు.

విక్టోరియాను ఆమె తలిదండ్రులు మిక్కిలి గారాబముగా పెంచుచుండిరి. వారిరువురకును బిడ్డయెడల అధికమైన ప్రేమ కలదు. కెన్సింగ్టన్ భవనమునందే శిశువు పెరుఁగుచుండెను. 1819వ సంవత్సరము కడపట, అనఁగా శిశువునకు రమారమి ఆఱుమాసము లైనప్పుడు, డ్యూక్ ఆఫ్ కెంటుగారును, ఆయన భార్యయైన డచ్చెస్ ఆఫ్ కెంటుగారును, వర్షాకాలమును గడపుటకై సిడ్మత్ అను గ్రామమునకు పోయిరి. అచట విక్టోరియాకు ఒక పెద్దగండము సంభవించెను. చిన్న చిన్నపిట్టలను ఆటలకై వేఁటాడుచున్న ఒకచిన్న వాఁడు, బిడ్డ

యుండు గది కిటికీకి సరిగా కాల్పఁగా, ఒక రవ కిటికీగుండా బిడ్డతలకు కొంచెము మీఁదుగా పోయి పడెను. దైవకృప చేత శిశువు బ్రదికెను. గుండుచప్పుడు విన్నమాత్రాననే, పనివాండ్రనేకులు ఇల్లువిడిచి అటునిటు పఱుగిడి తుపాకి ప్రేల్చిన పిల్లకాయను పట్టి తెచ్చిరి. జరిగిన వాస్తవ విషయమును, డ్యూక్ ఆఫ్ కెంటుగారు విచారించి, అది అజాగ్రత్త వలన జరిగిన కార్యమని యెఱింగి, ఆపిల్లవానిని మన్నించి పంపివేసిరి.

డ్యూక్ ఆఫ్ కెంటు మరణము

డ్యూక్ ఆఫ్ కెంటుగారికి తమ కొమార్తెయగు విక్టోరియా యెడల చాల ప్రేమకలదని మున్ను చెప్పియున్నారము. ఆప్రేమయే ఆయన మరణమున కొక కారణమైయుండెను. జడివాన కురియుదినములలో ఒకనాఁటి యుదయమున వారు చాలదూరము వాహ్యాళిచని, కాళ్లంతయు తడిసి రాజభవనమునకు మఱలి వచ్చిరి. చెమ్మగిల్లిన పైజాలను (బూడ్సును) తీయకయే, చాలసేపు తమబిడ్డను ముద్దాడుచుండిరి. అందువలన వారికి జలదోషము కలిగెను. అది కారణముగా మఱి కొన్ని వ్యాధులును వచ్చెను. లండన్ పట్టణములోని వైద్యులు వచ్చి తమచేనైనంతమాత్రము చికిత్స చేసిరిగాని ప్రయోజనము లేక పోయెను. ఈవ్యాధి సంభవించిన రెండు

వీరుఁడొకఁడు వేగముగాఁ జని, బండిలోనున్న శిశువును ఎత్తుకొని కాపాడెను.

ఉద్యానవన విహారము

విక్టోరియా కొంచెము వయస్సువచ్చిన పిదప, మునుపటివలె తన చిన్నబండిపై నెక్కక, ఒక వేసడముపై నెక్కి కెన్‌సింగ్టన్ తోఁటలో విహరించు చుండెను. ఆ వేసడము అందమును శాంతగుణమును కలది. విక్టోరియా బాలప్రాయమున నుండినను, ఆమె చర్యలన్నియును క్రమమైనవిగను మెచ్చతగినవిగను నుండెను. ఉదయము 8 ఘంటలకు తన తల్లితోఁగూడ కొంచెము రొట్టెను పాలును పండ్లును భుజించును; అటుపిమ్మట కొంతసేపటికి భోజనముచేసి కొంచెముసేపు తోఁటలో కాలినడకతోఁగాని సవారి చేయుచుగాని విహరించుచుండును; పగలు పదిగంటలుమొదలు పండ్రెండుగంటల వఱకును తల్లియొద్ద కూర్చుండి చదువుచుండును; ఆమీఁద తనబొమ్మల నుంచుకొని ఆడుచుండును. విక్టోరియా ఆటలాడు సమయమునందు దాది యైన మిస్ట్రిస్ బ్రాక్ దగ్గఱనే యుండును. మధ్యాహ్నమునకు మీఁద రెండుగంటలకు కొంచెము ఆహారము భుజించి నాలుగు గంటలవఱకును చదువు చుండును. అనంతరము తన తల్లితోఁగూడ బండినెక్కి బయట కొంతసేపు విహరించి, అచటనుండి వచ్చి ఒకగంటసేపు తోఁటలో

స్వారి చేయుచుండును. పిమ్మట కొంచెము ఆహారము పుచ్చు కొని దాదితోఁగూడ ఆడుచుండును. రాత్రి తొమ్మిదిగంట లకు తల్లిప్రక్క ఒక చిన్నమంచముపై పరుండి నిదురించును. రాంస్ గేట్ అనుచోటను, డర్ బ్రీడ్స్ వెల్సు అనుచోటను, వేసవి కాలమునందు తల్లియు బిడ్డయు వసియించుచుండిరి. రాంస్ గేట్ అనుచోట నున్నపుడు విక్టోరియా సముద్రతీరము నకుఁబోయి ఇతర బాలికలతోఁజేరి బొమ్మరిండ్లు కట్టి ఆట లాడుచుండుటయు కలదు.

విద్యాభివృద్ధి

విక్టోరియాకు నాలుగేండ్లు నిండినప్పుడు, బిడ్డకు క్రమ ముగా చదువు నేర్పింప నెంచి, రెవరెండ్ జార్జి డేవిస్ అను వారు ఉపాధ్యాయుఁడుగా నియమింపఁబడిరి. విక్టోరియాకు బాల్యము మొదలుకొని చదువుటయందు మిక్కిలి శ్రద్ధ కలదు. పదునొకండు సంవత్సరములలోపల ఫ్రెంచి, జర్మన్, ఇటాలి అను నీమూఁడు భాషలలోను చక్కఁగా మాటలాడుటకు నేర్చుకొనెను. లాటిన్ భాషయు కొంత వఱకు నేర్చికొని, అందలి గ్రంథములను ఆంగ్లేయ భాషలో పరివర్తనము చేయుటకు సమర్థత కలిగియుండెను. మఱియు ఈమెయొక్క విద్యాభివృద్ధికొఱకు పార్లిమెంటు సభవారు సంవత్సరమునకు ఆఱువేల పౌను లిచ్చునట్లు ఉత్త రవు చేసిరి. సంగీతమునందును, చిత్ర ప్రతిమలు వ్రాయుట

నుండి యాటలాడుచు సంతోషించుచుండిరి. పుత్రికయొక్క మనస్సునందు మంచివిషయములును మంచి యభిప్రాయములును నెలకొనుటకుఁ దగినట్టి నీతి విషయములనే నేర్పు చుండిరి. ఆమెవంటి తల్లు లెవ్వరును లేరని చెప్పునట్లుగా కొమార్తను రక్షించు చుండిరి. తల్లియొక్క బోధమువలన బిడ్డయొక్క గుణములును నడువడికలును మిక్కిలి మేలైన వాయెను. భూతదయ, ప్రీతి, సత్యము, వినయము మొదలగు విశేషము లైన సుగుణము లన్నియు బిడ్డయందు ప్రకాశించు చుండెను. వివేకమును ఇంగితజ్ఞానమును బిడ్డకు స్వాభావికముగనే కలిగియుండినవి. బిడ్డయొక్క బాల్య విద్యాభివృద్ధిని గాంచి ఉపాధ్యాయినులందఱును ఆశ్చర్య పడుచుండిరి. విక్టోరియా మిగుల సుందరవతిగా నుండెను. ఆకృతియందు తండ్రిని పోలియుండెను. నేత్రములు విశాలములై దీర్ఘములై నీలవర్ణముతోఁ గూడియుండినవి; శరీర కాంతియు ముఖసౌందర్యమును సకల జనులకును సంతోష దాయిగా నుండెను; అధరములు కొంచెము వికసించి సర్వదా సంతోషమునే కనఁబఱచు చుండినవి. రాజలక్షణము లన్నియు నీశిశువునం దమరి యుండినవి.

విక్టోరియా బాల్యక్రీడ

కెన్‌సింగ్టన్ రాజభవనమునందలి ఉద్యానవనములో ప్రతిదినమును విహరించుట వాడుకగా నుండెను. ఒక చిన్న

చేతిబండియందు విక్టోరియాను కూర్చుండఁబెట్టి బండిని లాగునపుడు చప్పట్లు గొట్టుచు కిలకిలనవ్వుచు ప్రక్కన చేనువారిని జూచుచు సంతోషించు చుండును. బిడ్డను బయటికి ఎత్తుకొనిపోయి ఇతర జనులను జూచి విషయములను గ్రహించునట్లు చేయవలయు ననెడి తలంపు తల్లికి కలదు. ఇంగ్లాండు దేశమునకు రాణి యగు కాలము వచ్చుననియును, అందుకొఱకు ఇతర లౌకికవిషయములుకూడా నేర్పుట మంచి దనియును ఆమె యభిప్రాయమై యుండెను.

ఆ ప ద లు

విక్టోరియా చిన్నశిశువుగా నుండినపుడు, ఆబిడ్డకు అనేక విధములగు ఆపదలు సంభవించెను. సిడ్మత్ అను చోట నివసించి యున్నపుడు ఒక సోమరిపిల్లకాయ తుపాకి ప్రేల్చినందున కలిగిన అపాయమునుగూర్చి యిదివఱకే చెప్పియున్నాము కదా.

ఒకనాఁడు విక్టోరియా ఒక చిన్నగుఱ్ఱమును బూన్చిన బండిలో నెక్కి ఆటలకై బండి తోలుచున్నపుడు, ఒక పెద్ద కుక్క గుఱ్ఱముయొక్క కాళ్లకు నడుమ దూరి పోయినందు చేత, గుఱ్ఱము బెదరి తన ముంగాళ్లను పైకెత్తగా, బండి తలక్రిందై పడెను. బిడ్డ ప్రాణమే పోయి యుండును. అయి నను ఆసమయమున హఠాత్తుగా ప్రక్కన బోవుచున్న యుద్ధ:

కాలస్థితినిగూర్చి ఆలోచించునట్టి శక్తి కలిగిన తర్వాతనే తెలియఁ బఱుపవలయు ననియును భావించి యూరకుండిరి.

పదునొకండు సంవత్సరములైనపిమ్మట, ఇఁక చెప్ప వచ్చు నని యామెకు తోఁచెను. కాఁబట్టి ఒకనాఁడు ఉపాధ్యాయినియు తామును విక్టోరియాకు ఇంగ్లండు దేశచరిత్రమును బోధించు కాలమునందును, ఇంగ్లండు రాజకుటుంబమును గూర్చియును, పట్టమునకు రాఁగలవారి వరుసను గుఱించియును బోధించుచుండిరి. విక్టోరియా వానినంతయు జాగరూకతతో వినుచుండి ఉపాధ్యాయినిం జూచి, ‟నా పెదతండ్రిగారైన రాజుగారు పరలోకవాసులైన మీఁదట పట్టమునకు రాఁగల వా రెవరు ?” అని యడిగెను.

‟తమయొక్క పెదతండ్రిగారైన డ్యూక్ ఆఫ్ క్లారెన్సు పట్టమునకు వత్తురు” అని ఉపాధ్యాయిని చెప్పెను.

‟ఔను ; ఆవిషయము నాకుఁ దెలియును. ఆయనకు తర్వాత పట్టమునకు వచ్చు వా రెవరు ?” అని విక్టోరియా యడిగెను.

ఉపాధ్యాయిని మాఱు బలుకలేదు. విక్టోరియాయొక్క మొగము వివర్ణమాయెను. కొంతసేపు ఊరకయుండి ‟సరిగనే, నాకిప్పుడు తెలిసినది. రాజును, డ్యూక్ ఆఫ్ క్లారెన్సును గతించినమీఁద నేనేకదా పట్టమునకు రావలయును” అనెను.

ఉపాధ్యాయినియు తల్లియును వెంటనే వాస్తవ విషయమును జెప్పి, రాజకృత్యమును రాజ్యవ్యవహార బాధ్యతలను బోధించిరి. విక్టోరియా అంతరంగమున విశేష విషయములు స్ఫురించినవేగాని, ఇతరము లగు బాల్యచేష్టలతో గూడిన సంతోషము కలుగలేదు. తనయొక్క స్థితిని గుఱించియును, తాను పొందఁబోవు మహాపదవిని గూర్చియును చాల చింతించెను. వయస్సు కొంచెమే యైనను, ఎక్కువైన ఆలోచనలును ఎక్కువైన అభిప్రాయములును ఆమె మనస్సునం దుదయమయ్యెను.

ఇఁకముందు తాను పట్టమునకు వచ్చుట నిజమని తెలిసియుండియు, అమె మనస్సునందు అహంకారము మొదలగు దుర్గుణము లెంతమాత్రమును కలుగలేదు. ఆమె ఎల్లప్పుడును ఏకరీతిగానే డంబములేక అందఱయెడల విశ్వాసము కలిగి వర్తించుచుండెను. గౌరవమును గర్వమునులేక సకల జనులతోడను కలసిమెలసి వ్యవహరించుచుండెను. 'చెట్టు స్వభావము పుట్టుకలోనే తెలియు' ననెడి పెద్దలమాట చొప్పున, వెనుకటి కాలమునం దామెయం దేర్పడియున్న సుగుణరాశి యంతయును బాల్యము మొదలుకొనియే అమరియుండినవి. మఱియు ఈమెకు ఇంటివిద్యను బోధించుటకు నియమింపఁబడిన డేవిస్‌గారు విద్యతోఁగూడ నీతిని మతమును మనస్సున నాటునట్లు బోధించుచుండిరి.

యందును ఆమెకు ఎక్కువ కోరిక కలదు. పదునొకండు సంవత్సరముల లోపలనే యింతటి నేర్పు కలిగియుండుట చాల ఆశ్చర్య మనుటయందు ఎంతమాత్రమును సంశయము లేదు.

డ్యూక్ ఆఫ్ యార్కుగారి మరణము

విక్టోరియాకు ఎనిమిదవ సంవత్సరము జరుగుచున్నపుడు అనఁగా 1827వ సంత్సవరమునందు ఆమె పెదతండ్రిగారైన డ్యూక్ ఆఫ్ యార్కుగారు మరణ మొందిరి. ఇందువలన విక్టోరియాకు కొంచెము దుఃఖము కలిగినదనియే చెప్ప వలయును.

గొప్పవిందు

విక్టోరియాయొక్క పదవయేఁట రాజభవనమునందు విశేషమైన మహోత్సవము జరిగెను. ఆవిందు విక్టోరియాకును, పోర్తుగల్ దేశపు బాలరాణికిని చేయఁబడెను. ఆవిందునకు లండన్ పట్టణమునందలి ప్రభువులును, యుద్ధవీరులును వచ్చియుండిరి. వారు ధరించియున్న వస్త్రములను ఆభరణములను విందుయొక్క విశేషమును గాంచి విక్టోరియాకు భ్రమ కలిగెను, అయినను, ఆమె నవ్వుమోముతో ముద్దుమాటలు బల్కి ఉత్సాహ పఱిచెను. వచ్చినవారంద ఱును అమితానందమును బొందిరి.

విక్టోరియా రాణి యని యెఱుఁగుట

విక్టోరియాకు పదునొకండవ సంవత్సరము జరుగుచున్న కాలమునందు, ఆమె ఇంగ్లాండు దేశపు రాణి కావచ్చు నని తెలిసి కొనెను. అంతవఱకును ఆమెయొక్క తల్లిగారు ఆ సంగతినిగూర్చి యేదియు చెప్పలేదు. ఏలన, పసిపాపయొక్క



రాణి యని యెఱుఁగుట

మనస్సులో రాజాంగ విచారములను కలుగఁజేయఁ గూడదనియును, కొంచెము వయస్సువచ్చి తనయొక్క భావి.

విక్టోరియా విహార వృత్తాంతము

ఒకనాఁడు మాల్వార్న్ అను చోటికి సమీపమున, తన తల్లితోడను ఉపాధ్యాయినితోడను బయట విహరించుట కేఁగి, విక్టోరియా తన కుక్కపిల్లతో నాడుచుండినపుడు, వింతయైన యొకవిషయము జరిగెను. ఏమన, విక్టోరియా చేతనున్న కుక్కపిల్ల పఱుగిడ నారంభింపఁగానే ఆమెయు వెంబడించి పఱుగెత్తెను. ఇట్లుపోఁగా అచ్చటికి ఒక బీద బాలిక వచ్చెను. అంత విక్టోరియా ఆబాలికను జూచి,

,,నా కుక్కపిల్ల చాల డస్సిపోయెను. దయచేసి నీవు ఈ కుక్కపిల్లను నాకొఱకు కొంచెముదూరము మోచికొని వచ్చెదవా?'' అనెను.

ఆమాటను విని ఆచిన్నది, విక్టోరియాయొక్క గొప్పతన మిట్టిదని యెఱుఁగక పోయినప్పటికిని, కుక్కపిల్లను ఎత్తి కొనెను. బాలిక లిర్వురును సంతోషముతో నవ్వుచు మాట లాడుచు పోవుచుండిరి. కొంతదూరము పోయిన పిమ్మట,

,,నేను బడలితిని. ఇఁక నీకుక్కను మోచుటకు నాచేత కాదు'' అని ఆచిన్న దనెను.

,,బడలినావా'' ఏమాశ్చర్యము, కొంచెము దూరమే కదా నీవు కుక్కపిల్లను మోచితివి?''అని విక్టోరియాచెప్పెను.

,,ఎంతదూరము కుక్కపిల్లను మోచికొని రావచ్చునో అంతదూరము మోచి తెచ్చితిని; నేను నాపెద్దమ్మ యింటికి

పోవలయును. నీ కుక్క డస్సిపోయినయెడల నీవేల మోచికొని పోఁ గూఁడదు?" అని ఆబాలిక చెప్పెను.

"నీపెద్దమ్మ యెవరు?" అని విక్టోరియా యడిగెను.

"నాపెద్దమ్మ పేరు మిస్ట్రిస్ జార్జసన్" అని ఆచిన్నది చెప్పెను.

"ఆమె ఎచ్చట కాపుర మున్నది?" అని విక్టోరియా యడిగెను.

"అదిగో కనఁబడు వెల్లవేసిన యింటిలో నున్నది" అని ఆచిన్నది చెప్పెను.

"ఆలాగైన నేను నీపెద్దమ్మను జూడవచ్చునా? నీవును నేనును పోవుదమురా. మన మిర్వురమును పఱుగెత్తుదము" అని విక్టోరియా చెప్పెను.

ఇంతలో ఉపాధ్యాయినియును, డచ్చెస్ ఆఫ్ కెంటును ఈబాలికలు మాటలాడుచుండు చోటికి వచ్చి చేరిరి. విక్టోరియా పఱుగిడుట కారంభింపఁగా ఉపాధ్యాయిని ఆమె చేతిని పట్టుకొని, యౌవరాజ్ఞీ! పఱుగిడ వద్దు. ఇంతసేపు ఆపిల్లతో మాటలాడినది చాలును. మనము ఇంటికి పోవుదము" అనెను.

"యౌవరాజ్ఞి" అనెడి మాటను విన్నంతనే ఆచిన్నది గడగడ వడంకెను. "నీకుక్కను నీవే మోచికొని పొమ్ము"

అని చెప్పినమాట తప్పేమో యని దిగులుపడెను. అయినను డచ్చెస్ ఆఫ్ కెంటు ఆ చిన్నదాని భయమును మాన్పి దానికి ఇనాముగా అర క్రౌనును (రెండున్నరు షిల్లింగును) ఇచ్చెను. ఆనాణెమును పుచ్చుకొని తన పెదతల్లియింటికి పఱుగిడిపోయి జరిగినదాని నంతయుఁ జెప్పఁగా, మిస్ట్రిస్ జాన్సన్ మిగుల సంతసించెను. మఱియు ముందు పట్టమహిషి కాఁగల యావ రాజ్ఞిని సంధించి తనకూఁతురు మాటలాడినందులకు ఆన వాలుగా ఆనాణెమును పటమున వ్రేలాడ కట్టెను.

నావికాయాత్రయు, ఆపదయు

అనంతరము రెండుమూఁడేండ్లకు పిమ్మట, విక్టోరియా, ఆమె తల్లియు ఇంగ్లాండుయొక్క చుట్టుపట్ల ప్రదేశములలో సంచరించుచు వేల్సు దేశమున కొన్ని దివసములు వసి యించియుండిరి. ఇంగ్లాండు దేశములోని మధ్యభాగములలో ప్రయాణముచేసి ఆక్సుఫోర్డు నగరమును జూచి, ఐల్ ఆఫ్ వైట్ అను చోట కొన్నిదినములు నివసించి, ఎమరాల్డు అను ఓడ నెక్కి దక్షిణ సముద్రతీరముగుండా ప్లీమత్ వఱకును పోయిరి. ఓడ, రేవునుగూర్చి పోవునపుడు ఒక ఆపద సంభవించెను. రేవు నందు నిలచియున్న ఆక్టివ్ అనెడి వేఱొక యోడపై ఎమరాల్డు మోదగా ఓడ స్తంభము విఱిగి పడెను. విక్టోరియా ఆసమయ మున ఆ స్తంభముదగ్గఱ నిలువంబడి యుండినందువలన, విఱిగిన స్తంభము ఆమెమీఁదుగనే పడియుండవలసి వచ్చును.

అయినను, ఓడ అధికారి తటాలునవచ్చి విక్టోరియాను ఎత్తి కొనెను. ప్రాణాపాయకరమైనే ఆయాపదనుండి సర్వేశ్వరుఁడు ఆమెను రక్షించెను.

ఆల్బర్టుప్రభు సందర్శనము

1836 వ సంవత్సరము మేనెల, అనఁగా విక్టోరియా యొక్క పదునేడవ సంవత్సరమునందు జరిగిన యొక సంభవమే ఆమెయొక్క వివాహమునకును, రాఁగల కాలములోని మహోన్నత పదవికిని కారణమైనది. డ్యూక్ ఆఫ్ కోబర్గు తమకుమారులైన ప్రిన్సు ఎర్నెస్టు, ప్రిన్సు ఆల్బర్టు అను వారితోఁగూడ ఇంగ్లండునకువచ్చి ఇంచుమించుగా ఒక నెల దినములు కెన్సింగ్టన్ భవనమునందు విడిసి యుండిరి. ప్రిన్సు ఆల్బర్టును విక్టోరియాను హెచ్చుతక్కువగా ఒక్కయీడువారుగా నుండిరి. అనఁగా, ఆల్బర్టుప్రభువు 1819 వ సంవత్సరము ఆగస్టునెల 26 వ తేది జననమొందిరి. కావున రాణిగారికంటె ఈయన మూఁడునెలలు పిన్నవారుగా నుండిరి. వీరికి పరస్పరమూ ఒకరినిజూచి యొక్కరికి మోహాము కలిగెననుటయందు సందేహము లేదు. మఱి కొన్నిదినములకు మీఁదనే వారికి వివాహము జరిగినప్పటికిని, పరస్పరము ఒకరి నొకరు చూచిననాఁటనుండియే ప్రేమ కలిగినది.

పదునెనిమిదవ సంవత్సరపు వర్షవర్ధంతి

1837వ సంవత్సరము మేనెల 24 వ తేదితో విక్టోరియాకు పదునెనిమిది యేండ్లు నిండినది. ఇంగ్లండు దేశమునం దంతటను ప్రజలు ఆదినమును ఉత్సవదినముగాఁ గడపిరి. అనేకులు వందనోపచార పత్రికలను, ఆశీర్వాద పత్రికలును కానుకలును బంపిరి. భవిష్యద్రాజ్ఞి యగు విక్టోర్యాకు ఆమె పెదతండ్రియును ఇంగ్లండురాజును అగు నాలవ విల్లియముగారు రెండువేల రూపాయలవెలగల సంగీతపేటిక (పియానా)ను బహుమతిగా నొసంగిరి. క్రీస్తువుల దేవాలయములలో జనులు చేరి దేవుని స్తుతించి, విక్టోరియాకు ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధి కలుగవలయు నని ప్రార్థించిరి. లండన్ నగర మంతయు అలంకరింపఁబడి దీపమాలికలతో ప్రకాశించు చుండెను.

రాజుగారి మరణము

ఆసమయమునందు నాలవ విల్లియం రాజుగారికి దేహము కొంచెము జబ్బుగా నుండెను. వ్యాధి మొదట స్వల్పముగా నున్నను, దిన దినము ఎక్కువ యగుచుండెను. వైద్యులు తమచేత నైనంత ప్రయత్నించిచూచిరిగాని సాధ్యముగాక, 1837 వ సం. జూన్ నెల 20 తేది రాత్రి 2 గంటలకు పరలోకమున కేగిరి.

సిమ్మట ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్బరియును, లార్డుచేంబర్లేనును ఈమరణవృత్తాంతమును విక్టోరియాకు చెప్పుటకై కెన్సింగ్టన్ భవనమునకుఁ బోయిరి. అప్పుడు తెల్లవారి 5 గంటల వేళగా నుండినది. ఈపిడుగువంటి సమాచారము విక్టోర్యాచెవినిఁ బడగానే మిగుల చింతించెను. కన్నుల నీరు స్రవింప నారంభించెను. అయినను ఆమె మోఁకరించి గతించిన పెదతండ్రిగారి ఆత్మసుఖముకొఱకు దేవునిప్రార్థనచేసెను. ఇంగ్లాండు దేశమును క్రమముగా పాలించుటకు సకల శక్తుల నొసంగవలయు ననియు స్తోత్రము కావించెను.

ఆమీఁద గతించిన రాజుగారి పత్నికి యీ సమాచారమును దెలిఁజేయుటకై ఒక కాగితమును వ్రాసి అందు విక్టోర్యాగారు తమదుఃఖమును తెలియఁ జేసిరి.

ఆదినము పగలు 11 గంటలకు మంత్రులును తక్కిన ప్రభువులును సుమారు 100గురు కెన్సింగ్టన్ భవనమునకు వచ్చి చేరిరి. ప్రభువులనుజూచి విక్టోర్యాగారు చాలదుఃఖముతోను కనికరముతోను. మాటలాడిరి. బాల్యముననే ఇంగ్లాండును పాలింపవలసిన భారము నాతలపైఁ బడియున్నదనియును, దేవుఁడు సహాయముచేసి కాపాడవలయు ననియును, ప్రజల క్షేమమే తమక్షేమమనియును, దానిని వృద్ధిచేయుటయందే సదా పాటుపడగల ననియును, చాల నొక్కి చెప్పిరి. ఈ

మాటలను వినినవా రందఱును, మిగుల పశ్చాత్తాపమును బొందిరి.

రాణి యని ప్రకటించుట

ఇంగ్లండు రాజుగారైన నాలవ విల్లియంగారు లోకాంతర వాసులైనందున, ఆమఱునాఁడు విక్టోర్యాగారు ఇంగ్లాండునకు మహారాజ్ఞి అని ప్రకటింపఁబడెను. విక్టోర్యాగారు కెన్‌సింగ్టన్ భవనమునందుండి బయలుదేరి సెంట్ జేమ్సు పాలెస్ అను సౌధమునకు వచ్చునపుడు మార్గములందు జనులు క్రిక్కిరిసి మహారాజ్ఞికి మంగళమగుఁగాక యని దీవించిరి. మఱియు జనులందఱు కరతాళధ్వనులు చేయుచు సంతోషించిరి. అయినను, మహారాజ్ఞిగారు ప్రజలయొక్క సంతోషమునుజూచి మఱింత మనోవ్యాకులతనొంది చాల దుఃఖించిరి. కారణ మేమనఁగా, ప్రజలను సంతోషింపఁ జేయు భారము తమపైఁబడినదే యనియును, పెదతండ్రిగారు గతించిరనియెడి చింతయును ఆమెను బాధించుచుండినది.

దీనులయెడ పశ్చాత్తాపము

విక్టోరియాగారు ఇంగ్లండునకు రాణియైనప్పటికిని తమ యొక్క బాల్యస్నేహితుల నెవ్వరిని మఱువలేదు. కెన్‌సింగ్టన్ భవనమునం దున్నపుడు ఎవరెవరితో పరిచయముకలిగియుండిరో వారినెవ్వరిని మఱచిపోవక మును

పటి స్నేహముతోనే వర్తించుచుండిరి. ఎవ రెవరికి ఏయే విధముగా సహాయము చేయవలయునో అట్లట్లే చేసిరి. కెన్సింగ్టన్ భవనమునకు సమీపమునందు హిల్‌మాన్ అనెడి సోల్జరొకఁడు కాపుర ముండెను. అతఁడు ప్రసిద్ధికెక్కిన యుద్ధవీరుఁడు. అతఁడు ఒకకొమారుని ఒకకొమార్తను పరితాపస్థితిలో విడిచిపెట్టి గతించెను. ఇట్లుండఁగా మఱి కొన్నాళ్లకు ఆకొడుకును మృతినొందెను. వాఁడు వ్యాధిగ్రస్తుఁడైయుండినపుడు విక్టోర్యాగారు అపుడపుడు పోయి చూచుచుండిరి. విక్టోర్యాగారు పట్టమునకు వచ్చిన సమయమున ఆపుత్రికయు వ్యాధిచే పీడింపఁబడుచుండినది. దానిని విక్టోర్యాగారు మఱచిపోక బైబిలులోని సంగీతము అను పుస్తకమును బహుమానము చేసిరి. ఎంతటి తక్కువ అంతస్తులోని వారినైనను అగౌరవముచేయక సమ్మానించు విశేషగుణము విక్టోర్యాగారియందు కలదు. మఱియొకదానిచేతను స్పష్టముగా దెలియవచ్చుచున్నది. ఎట్లన, కెన్సింగ్టన్ భవనమునకు సమీపమునం దొక బిచ్చగాఁడు సుమారు ఆఱేడు సంవత్సరములుగా వసించుచుండెను. వానిని చూచినపుడంతయు వానికి కొన్ని కాసు లిచ్చుచుంపుటకలదు. విక్టోర్యాగారు పట్టమునకు వచ్చిన మఱునాఁడు, వానికి తెలియఁబఱచినదేగాక, వారమునకు ఎనిమిది షిల్లింగులు ఇప్పించునట్లు ఉత్తరవు చేసిరి. ఇది యెంతటి శ్లాఘనీయమైన దయాళుత!

విల్లియముగారి సమాధి

1837 వ సంవత్సరము జూలై నెల 8 వ. తేది శని వారమునాఁడు, గతించిన నాలవ విల్లియముగారియొక్క కళేబరమును మిగుల గౌరవముతోను, రాజమర్యాదతోను గొనిపోయి సమాధి చేసిరి. ఉత్తరక్రియలెల్ల క్రమముగా జరిగెను.

రాజోపచారములు

ఆమీఁద విక్టోరియాగారు కెన్సింగ్టన్ భవనమునం దుండి బక్కింహాం భవనమునకు వచ్చి చేరిరి. అపుడే ఆమందిరము కట్టి ముగింపఁబడియెను. విక్టోరియాగారు ఆభవనమునకు వచ్చినపిదప రాజాంగ ఐతిహ్యములొకటివెనుక నొకటిగా జరుపఁబడినవి. విందు మొదలగునవియు జరిగెను. జూలై నెల 17 వ తేది పార్లిమెంటు మూయఁబడినపుడు విక్టోరియాగారు ప్రవర్తించిన పద్ధతినిగాంచి ప్రభువు లాదిగాఁ గలవా రందఱును చాల మెచ్చుకొనిరి.

భూతదయ

విక్టోర్యామహారాజ్ఞిగారు సింహాసనమునకు వచ్చిన కొద్ది దినములకే ఒక పత్త్రమునందు చేవ్రాలు చేయవలసి వచ్చినది. అందుల కామె చింతించినవిషయము నీక్రింద నుదహరించెదము.

ఎప్పుడుగాని మరణదండన విధింపఁబడు పత్త్రికలో ఇంగ్లండు రాజుగారి చేవ్రాలు లేనిది దండించుటకు సాధ్యము కాదు. ఇప్పుడు విక్టోరియాగారు చేవ్రాలు చేయవలసినవారైరి కదా!

ఒకానొక సైనికుఁడు పటాలములోనుండి ఘుమ్మాలు ఉత్తరవులేక వెడలిపోయినందువలన వానికి మరణదండనము విధించిరి. ఆమరణదండన పత్త్రికను చేతఁబట్టుకొని సైనికప్రధానాధికారియైన డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ అనువారు రాణిముందు చేవ్రాలుకొఱకు బల్లపైనుంచి చేవ్రాలు చేయవలసినదని విన్నవించిరి.

రాణిగారు ఆపత్త్రికను జదివి కన్నీరు గార్చుచు, "వీని కనుకూలముగా మీరు చెప్పఁదగిన దేమియు లేదా?" అని రాణిగా రడిగిరి.

"ఏమియులేదు; వీఁడు గొప్పతప్పు చేసినవాఁడు" అని వెల్లింగ్టన్‌గారు చెప్పిరి.

"ఇంకను కొంచెము ఆలోచింపుఁడు" అని మరల రాణిగారు వేఁడుకొనిరి.

మహారాజ్ఞిగారియొక్క పశ్చాత్తాపమును జూచి ముదుసలి యైన వెల్లింగ్టన్‌గారు—



మొదటి మరణదండన పత్త్రము

„అమ్మా! వీఁడు గొప్ప నేరము చేసినవాఁడే; అయినను, వాఁడు మంచివాఁడని ఒకరు చెప్పుచున్నారు. ఒకవేళ వాఁడు మంచివాఁడుగా నుండినను ఉండవచ్చును" అని చెప్పిరి.

„మీకు వేయి వందనములు" అని చెప్పి, చాల తొందరగా ఆమరణదండన పత్త్రిమునందు, „మన్నింపఁబడినది" అని చేవ్రాలుచేసి డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ ప్రభువుచేతి కిచ్చిరి.

ఇట్టి దయాళుత్వము రాణిగారికి జీవితపర్యంతము నుండెను. ఎప్పుడుగాని ఏకాగితమునుగాని చదువక తటాలున

చేవ్రాలు చేయుటలేదు. బాల్యమునుండియే ఆమెకు దీర్ఘాలోచనము గలదు.

పట్టాభిషేకము

మహారాజ్ఞిగారు పట్టమునకు వచ్చినట్టి ఒక సంవత్సరమునకు తర్వాత, అనఁగా 1838-వ సంవత్సరము జూన్ నెల 28-వ తేది కిరీటధారణ మహోత్సవము అత్యంత వైభవముతో జరుపఁబడినది. పలు దేశములలోనుండియు ప్రభువులాదిగాఁ గలవారు వేనవేలు జనులు లండన్ పట్టణమునకు వచ్చియుండిరి. ఆదినము ఉదయమున మహారాజ్ఞిగారి మకుటధారణోత్సవ మని సూచింపించుటకై కొన్ని గుండ్లు వేయఁబడియెను. ప్రతి దేవాలయములోను సంతోష చిహ్నమైన ఘంటానాదము మ్రోఁగుచుండెను. లండన్ నగరమంతయు ఆనందసూచకమైన అలంకారాదులు కన్పట్టుచుండెను. మకుటధారణ మహోత్సవమునకై చేరినట్టి జనులను లెక్కించుటకు సాధ్యముకాదు.

వెస్టుమినిస్టర్ ఆబి యనెడి దేవాలయమునందే కిరీటధారణ మహోత్సవము జరుపుట వాడుక గావున, ఆదినము వేకువజామున 4 గంటలు మొదలుకొనియే లెక్కలేని బండ్లు అచ్చటికిపోయి యుండినవి. అయిదు గంటలకు ద్వారము తెఱవఁబడెను. ఎల్లచోటులను జనులు క్రిక్కిరిసి.

యుండిరి. ఎనిమిదిగంటలకు లోపల, పలు దేశములలోని ప్రభువులును వారి వారి యువతులును మిక్కిలి ఆడంబరముగా శృంగారించికొని వచ్చి చేరిరి.



విక్టోరియా మహారాజ్ఞి

తొమ్మిదిగంటలకు సకలమైనవారును వచ్చిచేరిరి. పదిగంటలు పది నిమిషములకు ఊరేగింపు జరిగినది. అన్యదేశపు

ప్రభువులును అధికారులును రాయబారులును మొదటి వరుసయందు పోయిరి. రెండవ వరుసయందు మహారాజ్ఞి యొక్క కుటుంబస్థులు పోయిరి. పిమ్మటి వరుసలో రాణి గారి కంచుకీజను లనఁబడు ప్రభువులును స్త్రీలును పండ్రెండుబండ్లలో పోయిరి. కడపటివరుసలో మహారాజ్ఞిగారి శకటము పోయినది. ఇట్టి మహా వైభవమునుగాంచి జనులు కరతాళ ధ్వనులు చేయుచు మంగళాశాసనము చేయుచు నుండిరి. ఇట్లు మహోత్సాహముతో ఊరేఁగుచు వెస్టుమినిస్టర్ అబి చేరిరి. అచ్చట రాణిగారి పినతండ్రు లెదుర్కొనివచ్చి రాణిగారిని పిలిచికొనిపోయి సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టిరి. కిరీటధారణోత్సవము ఐతిహ్యము ప్రకారము వారి ప్రధాన మతాచార్యునిచేత జరుపఁబడెను. పిమ్మట ప్రభువు లొక్కరొక్కరుగా వచ్చి మోఁకరించి ప్రణమిల్లి కిరీటమును స్పృశించి ప్రభుభక్తిని జూపి ప్రమాణములు చేసిరి. ఆప్రకారమే తక్కిన సభ్యులందఱును రాణిగారిని మిగుల గౌరవించిరి. వారిలో, వృద్ధులైన యామె పినతండ్రులు కంబర్లండు ప్రభువును సస్సెక్సు ప్రభువును వచ్చినపుడు రాణిగారు వారికి ప్రత్యుత్థానము చేసిరిగాని, ఆప్రభువులుమాత్రము వాడుకను మీఱనివారై ఆమె మోఁకాళ్లమీఁదఁబడి మ్రొక్కి చేయి ముద్దిడి రాజభక్తి గలవార మని ప్రమాణము చేసిరి. అపుడు రాణిగారికి చాల మనోవ్యథగా నుండెను. బంధు

మర్యాదప్రకారము తాను వారికి మ్రొక్కవలసి యుండి యును రాజమర్యాదచే వారు మ్రొక్కవలసి వచ్చినది, అయినను ఆమె వెంటనే లేచి పినతండ్రులను ముద్దుపెట్టు కొని చాల సత్కరించిరి.

హానోవరు రాజ్యము

ఈ యిరువురు పినతండ్రులలో కంబర్లండు ప్రభువు హానోవరు దేశమునకు రాజయ్యెను. నాలవ విల్లియమున కనంతరము హానోవరురాజ్యముకూడా విక్టోరియాగారికే చెందవలసి యుండినప్పటికిని ఆదేశమునందు స్త్రీలు రాజ్య ము చేయరాదనెడి విధి యేర్పడియున్నందువలన కంబర్లండు ప్రభువు ఆదేశమునకు అధికారి యయ్యెను.

లార్డు మెల్‌బోర్న్ ప్రధానమంత్రి

విక్టోరియా మహారాజ్ఞిగారు పట్టమునకు వచ్చినకాలము నందు లార్డు మెల్‌బోర్న్ ప్రధానమంత్రిగా నుండిరి. రాజాంగసంబంధమైన సకలవిషయములయందును విక్టోర్యా గారికి ఆలోచన చెప్పుచుండిరి. వారికి, మిగుల దయయును జనులయెడల అనురాగమును, దీర్ఘాలోచనమును, దేశ క్షేమచింతమును అను నీ మొదలగు సుగుణములు మొదట నుండియే కలవు. వారినడువడికయు మాటయును చాల కొనియాడఁదగినవి. వారు చాల వృద్ధులైయుండిరి. మఱియు

మహారాజ్ఞిగారిని చూచినపుడు, తండ్రి కొమార్తను జూచి నపుడు ఎట్లు విశ్వాసముండునో అట్లే రాణిగారియందు ఆయన విశ్వాస ముంచియుండిరి. రాణిగారును వారిని తండ్రివలె చూచుచు ఆలోచనలను అడుగుచు నుండిరి. వారిమాట నెప్పుడును రాణిగారు జవదాఁటరు

వివాహ నిశ్చయము

1839-వ సం. అక్టోబరు నెల 10-వ తెది ఎర్నెస్టు ప్రభువును, ఆల్బర్టు ప్రభువును మఱల లండన్ నగరమునకు వచ్చిరి. ఆల్బర్టు ప్రభువుగారిని వరింపవలయునని మహారాజ్ఞి గారు నిశ్చయించికొని యుండిరి. ఆనెల 15-వ తేది నాఁడే "ఇఁక రాణిగారికి వివాహము జరుగును" అనెడి వృత్తాంతము వెల్లడి చేయఁబడియెను. మఱియు సామాన్యముగా ఆంగ్లే యుల ఆచారప్రకారమేగాక మహోన్నత పదవిలో నున్న వారు వరింపఁబోయెడి పురుషునికి తామే తమకోర్కని తెలియ చేయవలయును. కాఁబట్టి, విక్టోర్యా మహారాజ్ఞిగారు ముందుగా తమ యభిప్రాయమును ఆల్బర్టు ప్రభువుగారికి తెలియచేయవలసినవారైరి. అయినను ఇట్లు తెలుపుటకు రాణిగారు చాల లజ్జితులైరి. దేశాచారమును అతి క్రమించుటకు కాదుగదా? ఇట్లుండఁగా నొక్కనాఁడు రాణి గారు చెలికత్తెతో మాటలాడుచుండినపుడు తమ వివాహ నిశ్చయమును మంత్రుల సభలోఁ దెలియఁజేయవలసిన

విషయమునుగూర్చి ప్రశంసించిరి. అందులకు చెలికత్తె అది చాలజంకైన పని యనెను. అందులకు విక్టోర్యా రాణిగారు "ఔను; అది జంకైన కార్యమే;. ఇంతకు పూర్వము అల్బర్టు ప్రభువుగారికి నేను తెలియఁబఱచినది యింతకంటె లజ్జగానే యుండినది" అనిరి.

మంత్రులకుఁ దెల్పుట

ఆమె చెప్పిన చొప్పుననే మఱునాఁడు అనఁగా 1839-వ సంవత్సరము నవంబరు నెల 23వ తేది మంత్రుల సభ సమావేశ మైనది. ఆసభలో ఎనుబదిమంది చేరియుండిరి. అప్పుడు రాణిగారు తన ప్రాణప్రదునిబింబముగల పతకమును ధరించికొని మెల్లగా సిగ్గుచే సభకు వచ్చి, తాను వ్రాసితెచ్చిన కాగితమును మృదుస్వరముతోఁ జదివిరి. అంతట నొక ప్రభువువచ్చి ఈపత్త్రికను ప్రకటించుటకు సెలవుకోరెను. ఆమె ఆకాగితమును అతని చేతికిచ్చి అంగీకార సూచకముగా తలయూఁచి వెడలిపోయిరి. ఈవిషయమునుగూర్చి రాణిగారు తమ దినచర్యపుస్తకమునందు "నేను పగలు రెండుగంటలకు సభకుఁ బోయితిని. అచ్చట నున్నవారిని నేను జూడలేదు......పిమ్మట నా ప్రకటనమును జదివితిని. అప్పుడు నాకు వడఁకుపుట్టెను. అయినను తప్పుగాఁ జదువలేదు. చదివిన యనంతరము నేను ధన్యనైతినిగదా యని సంతోష మొందితిని...పిమ్మట సభవిడిచి తొలఁగితిని..

ఇట్టి ధైర్యము నాకు నాపతియొక్క స్వరూప పలకమును ధరించినందుననే కల్గినట్లు భావించెదను" అని వ్రాసికొని యున్నారు.

పార్లిమెంటుకు తెలియఁజేయుట

1840-వ సంవత్సరము జనవరి నెల 16-వ తేది పార్లిమెంటు సభ తెఱవఁబడినది. అప్పుడు మహారాజ్ఞిగారు తమ వివాహ నిశ్చయమును పార్లిమెంటువారికి తెలియఁబఱచిరి. పార్లిమెంటుసభవారును అంగీకరించిరి.

ఆల్బర్టు ప్రభువు

ఈ వివాహవిషయమును గూర్చి ఆల్బర్టుప్రభువుగారికి చాల సంతోషముగ నుండెనని వేఱుగాఁ జెప్పవలసినది లేదు. ఆయన తన అవ్వగారికి వ్రాసిన కాగితమునందు:— "కొన్ని దినములకు ముందు విక్టోర్యామహారాజ్ఞి నన్ను తన గదికి రావించి, నాయందే ఆమెచిత్తము సంపూర్ణముగా మగ్నమైయున్నదనియును, నేను ఆమెను వరించితినేని ఆమెకు చాల సంతోషముగా నుండుననియును వాస్తవమైన ప్రేమాభిప్రాయమును దెలియఁజేసెను" అని వ్రాసియున్నారు.

ఆల్బర్టుగారి గుణవిశేషము

ఆల్బర్టుప్రభువుగారు విద్యయందును, బుద్ధియందును మిగుల సమర్థులై యుండిరి. చిత్రములు వ్రాయుట యందును



ఆల్బర్టు ప్రభువు

సంగీతమునందును మిగుల ప్రసిద్ధిగలవారై యుండిరి. సంగీతమును చక్కఁగా పాడుదురు. వారు విశేషవిద్యావంతులు గనుక ఎన్నియో కీర్తనములను రచియించియున్నారు. ఎప్పుడును సంతోషచిత్తులై యుందురు. వారియొక్క విశేషగుణసంపదను విద్యావైదుష్యమును జూచినమీఁద ఆంగ్లేయులు వారియెడల చాల గౌరవము నుంచియుండిరి.

ఆల్బర్టు ప్రభువుగారికి సొంత ధనమును కొంతయుండినది. ఆధనము వారి ఖర్చులకు చాలినంత యుండెను. వారు

వ్యర్థముగా ధనవ్యయముచేయువారు కారు కనుక, ఆయనకు విశేషధన మక్కఱలేక పోయెను.

విక్టోర్యాగారికి వివాహమైన తర్వాత ఆల్బర్టు ప్రభువుగారు బ్రిటిషు ప్రజలలో నొకరనియును, ప్రతి సంవత్సరమును వారి వెచ్చముకొఱకు ముప్పదివేల పౌనులు ఇప్పింపఁబడుననియును పార్లిమెంటువారు ప్రకటించిరి. వివాహమైన పిదప ఆల్బర్టుగారు 1840 సం. సెప్టంబరునెల 11 తేది రాణిగారి అంతరంగికసభలో నొక సభ్యులైరి.

విక్టోర్యా వివాహము

ఆల్బర్టు ప్రభువుగారు 1840-వ సంవత్సరము ఫిబ్రవరి నెల 8-వ తేది ఇంగ్లాండును జేరిరి. ఫిబ్రవరి నెల 10-వ తేది వివాహము జరిగెను. వివాహమునకు మునుపు ఆల్బర్టుప్రభువుగారు తాను ఇంగ్లాండుదేశవాసులలో నొక్కఁడనై, రాణిగారి అధికారమునకు లోఁబడిన ప్రజలలోఁ దానునొకఁడనై, ప్రభుభక్తి కలవాఁడనై, యుండెద నని ప్రమాణము చేసిరి.

వివాహమునాఁడు ఉదయముననే దంపతులు దేవాలయమునకుఁ బోయిరి. అచ్చట లక్షలకొలఁది జనులు క్రిక్కిరిసి యుండిరి. వివాహపద్ధతియం దొక ధర్మసందేహము కల్గెను. ఏమనఁగా, ఇపుడు రాణి తనకు లోఁబడిన ప్రజలలో నొక్కరుని వరించుటంబట్టి, వివాహకాండలోని వాక్యప్రకార

ముగా ‟సకల విషయములందును నేను నీకు విధేయురాల నయ్యెదను” అనెడి వాక్యము నీమెచేత నుచ్చరింప వచ్చునా? యనియె. పిమ్మట ప్రధానమతాచార్యుఁడు రాణిగారితో ‟విధేయురాల నయ్యెద” నవెడి వాక్యమును విడిచిపెట్టుటకు దేవిగారికి యిష్టమా? అని యడిగెను. అందుల కామె ‟ ఏదియు విడిచిపెట్ట నక్కఱ లేదు” అని చెప్పిరి. పిమ్మట విక్టోర్యారాజ్ఞిగారిని ఆమె పినతండ్రులలో నొకరైన సస్సెక్సు గారు కన్యాదానము చేసిరి. అపుడు జయఘోషములతో ‟ దేవుఁడు వధూవరులకు సంతోషము నొసంగు గాక” అని ఆశీర్వదించిరి. పిమ్మట ప్రధానాచార్యుఁడు లేచి, ‟ఓ విక్టోరియా! నీవు నీభర్తకు సమస్త విషయములయందును సహాయురాలవై యుండి నిన్నతనికి సమర్పించుకొనెదవా ?” అను మొదలగు ప్రశ్నములు వేసెను. అందులకు రాణిగారు ‟తప్పక నేను వారికి సర్వవిధములయందును సహాయనై యుండి ఆత్మార్పణము చేసెదను” అని చెప్పెను. వివాహ సమయమునం దామె కిరీటమును ధరింపక అవగుంఠనవతియై యుండెను. రత్నహారమును ధరించి యుండెను. కర్ణాభరణము దాల్చియుండెను. ఆమెయొక్క వస్త్రములు వేలకొలఁది రూపాయల వెల గలదిగా నుండెను. వివాహ ఐతిహ్యమంతయు క్రమముగా జరిగెను. వధూవరులు పెద్దలకు వందనములుచేసి వారి యాశీర్వాదంబులం బడసి శక

టారోహణముచేసి రాజగృహమునకుఁ బోవునపుడు ఇరువది రెండు మైళ్లపొడుగునను ఆరాజదంపతులను వీక్షించుటకై వచ్చియున్న ప్రజలతోఁ గ్రిక్కిరిసి యుండెను. పిమ్మట ఆ రాజదంపతులు అన్యోన్యముగా వర్తించుచు సుఖంబుగా నుండినవిషయము లోకవిదితమయి యున్నది.

చంపుటకు ప్రయత్నము

వివాహమైన పిదప భార్యాభర్తలిర్వురును కొంత కాలము విండ్‌సర్ భవనమునందు వసించుచుండిరి. అపుడు విక్టోర్యాగారు గర్భవతిగా నుండిరి. దంపతులు వాడుక చొప్పున ఒకనాఁటి సాయంకాలము నాలుగు గుఱ్ఱములు కట్టిన రాజశకటము నెక్కి ఉద్యానవన విహారము కొఱకు (1840 సం. జూన్ నెల 10 తేది) బయలువెడలిరి. భండికి వెనుకప్రక్క ఇద్దఱు అశ్వపాలకులును,ముందుప్రక్క ఇద్దఱు గుఱ్ఱపు రౌతులును నుండిరి. ఇట్లు పోవుచుండఁగా పదునేడు సంవత్సరముల వయస్సుగల ఎడ్వర్డు ఆక్సుఫోర్డు అనెడి దుష్టుఁడు రాణిగారి మీఁదికి గుఱిపెట్టి చేతితుపాకితోఁ కాల్చెను. ఆధ్వని విననచ్చినవైపునకు ఆల్బర్టుప్రభువుగారు దృష్టి నిగుడించి చూచిరి. వెంటనే రాణియు లేచిరి. ఆమెను తల యెత్తనీక ఆల్బర్టుప్రభువుగారు అట్లే తమప్రక్కఁ జేర్చి కూర్చుండఁ జేసిరి. ఆ దుర్మార్గుడు మఱలను కాల్చెను. అయినను, దేవుని ఆజ్ఞలేనిదే యేకార్యమును జరుగదు

కదా ? ఆదుష్టుని తలంపు కొనసాగలేదు. దేవుఁడు రాణి గారికిని ఆమె భర్తకును ఏవిధమైన కష్టమును కలుగఁ జేయక రక్షించినాఁడు. పిమ్మట ఇరుగు పొరుగులలో పోవుచున్న జనులువచ్చి వానిని పట్టుకొనిరి.

పిమ్మట ఆదంపతులు సుఖముగా ఇల్లుపోయి చేరిరి. వారు ఇల్లు చేరుటకు మునుపే యీవృత్తాంతము ఎల్ల చోటుల లోను వ్యాపించినందున వారు పోవుమార్గమునందును వారి భవనము చెంతను జనులు గుంపులు గుంపులుగాఁ జేరి, వారిని దేవుఁడు రక్షించినందులకు జయజయధ్వనులు చేయుచుండిరి.

అనంతరము ఆఘాతుకునికి రాజద్రోహికి ముప్పదియైదు సంవత్సరములు కారాగృహవాస శిక్ష విధించిరి. ఆగడువు ముగిసినమీఁద వానిని ఆస్ట్రేలియా ద్వీపమునకుఁ బంపివేసిరి. వాఁడు ఆద్వీపమున చాలకాలము ఇండ్లకు వర్ణము వేయు వృత్తిచేత పొట్టపోసికొనుచుండి గతించినాఁడు.

మేరీ లూయిసా జననము

1840వ సం. నవంబరు నెల 21వ తేది మహారాజ్ఞిగారికి ప్రథమపుత్త్రిక జనించెను. ఈ శిశువునకు 1841వ సం. ఫిబ్రవరి నెల 10–వ తేది విక్టోరియా ఎడిలెయిడ్ మేరీ లూయిసా అని నామకరణము చేసిరి. విక్టోర్యాగారు ఇతర ధనికుల యింటి స్త్రీలవలెఁ గాక తమబిడ్డల కందఱకును తామే

పాలచ్చి పెంచుచుండిరి. అయినను, రాజగౌరవార్థము వాల దాదికి ఏనూఱుపౌను లియ్యఁబడెను. రాణిగారు తమ రాజ్య భారము నిర్వహించుచు, సమయముసంఘటించినప్పుడంత యు ఈ శిశువును ఎత్తుకొని ముద్దాడుచునుండిరి. ఈ కన్యక కొంచెము పెద్దదైనపిమ్మట తన తల్లియొక్క ఆట వస్తువుల తోనే ఆటలాడుచుండెను. విక్టోర్యాగారు ఈ పుత్త్రిక విద్యా విషయమునందు చాల శ్రద్ధపుచ్చుకొనుచుండిరి. తమకు తీఱిక యగునపుడంతయును పాఠములు నీతులు గఱపుచుండిరి. ఈ చిన్నది పెద్దదైనపిదప, అనఁగా 18 సంవత్సరముల వయసున జర్మను చక్రవర్తిగారి కుమారుని వరించెను. ఈమెకు నలుబది వేలపౌనులు అరణ మిచ్చినదేగాక, సంవత్సర మొకటికి ఎనిమిది వేలపౌన్లు లిచ్చుటకు ఏర్పాటు చేసిరి.

ఆల్బర్టుగారికి ఆపదతప్పుట

పైనిజెప్పిన నామకరణ మహోత్సవముజరిగిన రెండవ దినము రాణిగారును భర్తగారైన ఆల్బర్టుగారును తక్కిన పరిజనమును ఉద్యానవన విహారము చేయుచుండిరి. అపుడు క్రీడాసరోవరమునందు మంచుగడ్డపై ఆల్బర్టుగారు ఇనుప మ్జోడు తొడిగికొని నడుచుచుండఁగా తటాలున మంచుగడ్డ బీటపాఱెను. ఆల్బర్టుగారు లోఁతునీటిలో పడిరి. పరిజనులు దిక్కుతోఁపక తొట్రిల్లుచుండఁగా వెంటనే విక్టోర్యాగారు ధైర్యముతోపోయి భర్తకు చేయూతనిచ్చిగట్టుచేర్చిరి. రాణి

గారు సాహసింపనియెడల ఆయనకు అపాయము సంభవించి యుండును. ఇంగ్లండు మొదలగు శీతలదేశములలో నీటిపై మంచుగడ్డ పేరియుండును. ఆ మంచుగడ్డలపై జనులు వినోదార్థమై ఇనుప పాదరక్షలు తొడిగికొని సంచరింతురు.

ప్రిన్సు ఆఫ్ వేల్సు జననము

1841వ సంవత్సరము నవంబరు నెల 9 తేది విక్టోరియా మహారాజ్ఞి గారికి ప్రథమ పుత్త్ర జననము కల్గెను. పట్టమునకు పుత్త్రుఁడు కల్గినందులకు తల్లిదండ్రులేగాక దేశములోని వారెల్లరును సంతోష సాగర మగ్నులై యుండిరి. మహారాజ్ఞి గారు తమ సంతోష సూచకమునకు చిహ్నముగా చెఱసాలలోని నేరస్థులలో కొందఱకు శిక్షాకాలము తగ్గించినదే గాక, ఎందఱను మన్నింపఁదగునో వారినందఱను వదలి పెట్టునట్లు ఉత్తరవు చేసిరి. శిశువు పుట్టిన ఒక నెలకు తర్వాత ప్రిన్సు అఫ్ వేల్సు ఎరల్ ఆఫ్ చెస్టర్ అనెడి పట్టము నొసంగిరి. 1842 వ సంవత్సరము జనవరి నెల 25 తేది ఆల్బర్టు ఎడ్వర్డు అని నామకరణము చేయఁబడినది. ఈ మహోత్సవమునకు ఇరువదిలక్షల రూపాయలు వ్యయమయ్యెను. పాలదాది మొదలగువారికి మునుపటికన్నరెట్టింపుగా బహుమానము చేయఁబడియెను.

ఎడ్వర్డుప్రభువుగారియొక్క సంరక్షణమునందును విద్యావిషయమునందును విక్టోర్యా మహారాజ్ఞిగారును ఆల్బర్టు

ప్రభువుగారును విశేష శ్రద్ధ వహించి రని చెప్పవలసినది లేదుకదా ?

మఱియొక ఘాతుక కృత్యము

1842వ సంవత్సరము, మే నెల 29 తేది సాయంకాలము రాణిగారు భర్తతోఁ గూడి దేవాలయమున కేఁగి ప్రార్థనలు సలిపి యింటికి వచ్చుచుండఁగా వారిబండికి ఏడెనిమిది గజముల దూరమునందుండి జాన్ ఫ్రాన్సిస్ అను దుర్మార్గుఁడు తుపాకిని ప్రేల్చెనుగాని దైవాధీనముచేత ఆ తుపాకి ప్రేలలేదు. ఇంతలో వారిబండి వెడలిపోయెను. ఈ ఘాతుకుని అల్బర్టుగారు తానొక్కఁడే చూచినట్లు తలంచియుండెను. అయినను అచ్చటనున్న ఒక ముసలివాఁడును ఒక బాలుఁడును చూచిరి. వారిలో బాలుఁడు మఱునాఁడు తాను జూచిన సంగతిని రాజమందిరమునకు వచ్చి చెప్పెను. ఆ రాత్రియే అల్బర్టుప్రభువుగారు రాణిగారితోఁ జెప్పిరి కావున. ఉదయముననే రక్షక సంఘమువారికి రాణిగారు తెలియఁజేసిరి. వారు ఆనేరసుని వెదకుచుండిరి. ఈ ఘాతుకుఁడే కొన్ని దినములకు ముందు అల్బర్టు ప్రభువుగారిని కాల్చెనుగాని మంచివేళకు ఆ గుండుదెబ్బ ఆయనకు తాఁకలేదు. మహారాజ్ఞిగారు ఈవిధమైన ఆపదయందును కళవళపడక ధైర్యముతో నుండిరి.

ఆ మఱునాఁడును ఎప్పటియట్ల రాణిగారు భర్తతోఁ గూడి విహారముకొఱకు బయలువెడలిరి. రాణిగారి గౌరవ పరిచారిక బండి నెక్కుటకు రాఁగా ఆమెను నీవు రావలదని చెప్పిరి. ఆ పరిచారిక కారణము తెలియనందున ఖిన్నురాలై నిలిచిపోయెను. వారి బండిముందుగా ఇద్దరు అంగరక్షకులు పోవుచుండిరి. పూర్వము ఆక్సుఫోర్డు తుపాకికాల్చిన సల మునకు కొంచెము దూరముననే నిలిచి ఆ జాన్ ఫ్రాన్సిస్సే ఈనాఁడును తుపాకి ప్రేల్చెను. దైవయత్నము లేమిం జేసి నేఁడును ఆ దెబ్బ వారిపైఁ బడలేదు. వెంటనే వాఁడు పట్టు బడెను. పిమ్మట ఇంటికి వచ్చినపుడు రాణిగారు ఆ గౌరవ పరిచారికతో ,, నేను నిన్ను వెంటపిలుచుకొని పోనందులకు కారణము నీకిప్పుడు తెలిసి యుండును'' అని సమాధానము చెప్పిరి. ఆ దుర్మార్గుని విచారించి జూన్ నెల 17 వ తేది మరణదండన విధించిరి. ఆవార్త వాని చెవిని సోఁకగానే మూర్ఛిల్లి నేలకొరిగెను. పిమ్మట రాణిగారు వానిని కరుణించి ద్వీపాంతరవాసశిక్షగా మార్చి టాస్మానియాకు పంపించిరి. ప్రాణహంతకులయెడలకూడా మహారాజ్ఞిగారికి కనికరము మెండుగాఁ గలదు.

మీఁదఁ జెప్పినట్టి ఆపద సంభవించిన దినమునందే (మేనెల 30వ తేదియందే) విక్టోర్యా రాజ్ఞిగారు ఎంత మాత్రమును దిగులుచెందక భర్తతోఁగూడి యొక నాటక

శాలకు పోయిరి. అచ్చట నున్నవారందఱును రాజదంపతుల ధైర్య స్థైర్యములకు మెచ్చి జయ ఘోషములును కరతాళ ధ్వనులును చేసిరి. రాణిగారి మేనమామగారు ఆమెనుజూచి 'నీవు ధీరురాలవు' అని పొగడిరి.

వేఱొక క్రూరకృత్యము

జాన్ ఫ్రాన్సిస్ అను వానియెడల దయతలఁచి ద్వీపాంతరవాసశిక్ష నొసంగిన మఱునాఁడే, అనఁగా జూలై నెల 3వ తేది, రాణిగారు తమ మేనమామగారితోడఁగూడి దేవాలయమునకుఁ బోవుచుండఁగా జాన్ విల్లియంబీన్ అను పొట్టివాఁ డొకఁడు రాణిగారిపై గుఱిపెట్టి కాల్చెను. ఆ తుపాకి ప్రేలకపోయినది. వెంటనే వానిని పట్టుకొని చెఱసాలలో నుంచిరి.

పిమ్మట, రాణిగారు ప్రధానమంత్రులతో నాలోచించి యిట్టి ఘాతుకకృత్యములు చేయువారిని శిక్షించునట్టి శాసనమును జేయవలయు ననిరి. అట్లే నాలుగు దినములలో శాసనమును వ్రాసి పార్లిమెంటు సభవారివలన అంగీకరింపఁ జేసిరి. ఈ నూతనశాసనమునందు రాజద్రోహులు ఏడు సంవత్సరములు ద్వీపాంతరవాస శిక్షగాని, మూఁడు సంవత్సరములకు పైఁబడని కారాగృహ వాసముగాని, బహి

రంగముగా మూఁడు తేపలకు మించకుండా దెబ్బలు కొట్టఁబడుటకుఁగాని అర్హులగుదు రని ప్రకటింపఁబడియున్నది. ఈ శిక్షాస్మృతి ప్రకారమే జాన్ విల్లియంబీన్ అను వానికి పదునెనిమిది నెలలు కారాగృహవాస శిక్ష విధించిరి.

కలహములు

మహారాజ్ఞిగారు పట్టాభిషిక్తులైన కొలఁదిదినములకే కలహములు జరుగ నారంభించెను. ఆంగ్లేయులకు మిత్త్రుఁడైన అమీరు నొకనిని అఫ్గనిస్థానమునకు రాజుగాఁ జేయుటకై 1838 వ సంవత్సరమునందు బ్రిటిషువారి సేన పోయియుండెను. ఈ క్రొత్త అమీరునకు సహాయము చేయుటకై పోయియున్న సైన్యము కాబూలునందు విడిసియుండెను. 1841 వ సంవత్సరము నవంబరు నెల 2 వ తేది కాబూలుజనులు గొప్ప కలహము చేసినందున ఇంగ్లీషు సైన్యము మఱలి పోవలసివచ్చెను. అప్పుడు చలి·గాలి మంచు వీనికి తాళఁజాలక అనేకులు మడిసిరి. ఇట్లు తమ సైన్యమునకు నష్టము కల్గినందున ఆంగ్లేయ రాజాంగము వారు చాల కోపమొంది సర్ రాబర్టు సెల్, జనరల్ పోలక్ అను నిద్దఱు సేనాధిపతులు కాబూలునకుపోయి అఫ్గనులను జయించి కాబూలు పెద్దబజారును తగులబెట్టించి ఇండియాకు మఱలిరి.

ఇట్టి సమయముననే ఆంగ్లేయులకును చీనావారికిని విరోధము సంభవించెను. చీనాదేశస్థులు ఇతర దేశస్థులను మిక్కిలి నీచముగను, అలక్ష్యముగను జూచెడి స్వభావము కలవారు. అందువలన వారు ఆంగ్లేయులనుకూడా ఆ ప్రకారమే తలంచి కీడుచేయ తలపెట్టిరి. ఆ కారణముచేత ఆంగ్లేయుల యుద్ధనావయొకటి కాంటర్ నదిమార్గముగాఁ బోయి చీనావారి ఫిరంగులను స్వాధీనముచేసికొని వారి రేవు పట్టణముల నన్నిటిని నశపఱుచుకొనెను. ఆ పిమ్మట చీనావారు సమాధానమునకు వచ్చిరి. అదిమొదలు అనఁగా 1841 వ సంవత్సరము మొదలు ఆంగ్లేయుల నావలు చీనావారి రేవు పట్టణములకు ఆటంకములేక పోవచ్చుననెడి స్వతంత్రము కల్గినది.

1843 వ సంవత్సరమునందు బ్రిటిషువారికిని ఇండస్ నదీ తీరములోనుండు సింధు మాగాణము వారికిని జగడము ప్రారంభ మయ్యెను. జనరల్ సర్ చార్లెస్ నేపియర్ అను వారు ఆంగ్లేయ సైన్యమును దీసికొనిపోయి ఘోరయుద్ధము చేసి, సింధుదేశములోని హైదరాబాదుపట్టణమును స్వాధీనము చేసికొనిరి. ఆ పిమ్మటకూడా కొంతకాలము యుద్ధము జరిగెను. అనంతరము సింధుమాగాణ మంతయు ఇంగ్లీషు వారి వశ మైనది.

స్వదేశ సత్కారము

1842 వ సంవత్సరమునందు విక్టోర్యా మహారాజ్ఞిగారు మొట్టమొదట స్కాట్లండు దేశమున కేగిరి. ఆ దేశవాసులు ఆమెను చాలమర్యాదతోను సంతోషముతోను సత్కరించిరి.

ఆలిస్ జననము

1843 వ సంవత్సరము ఏప్రెల్ నెల 25వ తేది మహారాజ్ఞిగారికి మఱల నొక కొమారిత పుట్టెను. ఆమెకు ప్రిన్సస్ ఆలిస్ అని నామకరణ మొనర్చిరి. ఈమె బాల్యమునందు పరిహాస ప్రియురాలుగను వ్యాయామనిరతురాలుగను నుండి నప్పటికిని వయస్సు వచ్చినకొలఁదిని చాల వివేకవతియును పరోపకారగుణపారణయు నయ్యెను. ఈమెయే 1861 వ సంవత్సరమునందు తండ్రి రోగగ్రస్తుఁడై యున్నపుడు ఆయనకు సకల శుశ్రూషలను జేయుచు కంటికి ఱెప్పవలె కాఁచి యుండెను. ఈమె జర్మనిలోని హెస్సీ దేశపు రాజకుమారుఁడైన లూయిస్ గారిని వరించెను. వివాహకాలమునందీమెకు పార్లిమెంటు సభవారు ముప్పదివేల పౌనులు అరణమిచ్చిరి. అదిగాక ప్రతి సంవత్సరమునను ఆఱువేల పౌనులిచ్చుట కంగీకరించిరి. ఈమె తన తల్లివలెనే కరుణగలదై మంచిపేరు తెచ్చుకొనెను. ఫ్రెంచివారికిని జర్మనువారికిని యుద్ధము జరుగుచున్న కాలములో దెబ్బలుతిన్న సైనికులకు తానును

ఒక దాదివలె అప్పుడప్పుడు వైద్యశాలకుఁబోయి వారిని విచారించుచుండెను. 1873 వ సంవత్సరమునం దీమె యొక్క ఇద్దరు కొమరులలో నొక్కఁడు గవాక్షము యొద్ద నుండి క్రిందపడి గతించెను. 1878 వ సంవత్సరమునందు ఈమె భర్తకును, ఏవురు బిడ్డలకును అపాయకరమైన వ్యాధి వచ్చెను. వారికీమె చేయుచున్న శుశ్రూషకు విలువలేదు. అయినను వారిలో నొక శిశువు తప్ప తక్కిన వారందఱును మృతినొందిరి. తుదకు ఈమెనుకూడా ఆ వ్యాధియే మ్రింగివేసెను. మహారాజ్ఞిగారు పుత్రికా శోకముచేత చాల ఖిన్నమనస్కులైరి.

ఫ్రాన్సు దేశమున కేఁగుట

1843 వ సంవత్సరము సెప్టంబరు నెల 1 వ తేది మహారాజ్ఞి విక్టోరియాగారు పరివారముతోఁ గూడి ఫ్రాన్సు దేశమునకుఁబోయిరి. అచ్చటనుండు ఫ్రెంచి రాజుగారిని రాణిగారిని జూచిరి. వారిచే ఆతిథ్యము నొంది సత్కరింపబడిరి. మఱియు ప్రభువు లాదిగాఁగలవారును స్వాగతమొసంగి మిగుల గౌరవించిరి. పిమ్మట రాణిగారు అచ్చటి వినోదములు మొదలగు వానిని జూచికొని బయలువెడలి 7 తేది ఇంగ్లండు చేరిరి.

బెల్జియమునకుఁ బోవుట

అనంతరము కొన్నిదినములకు మీఁద విక్టోర్యా మహారాజ్ఞిగారు బెల్జియమునకు పోయిరి. అచ్చటఁ గల ప్రాతపట్టణములను, కోట కొత్తళములను ఇంకనుఁ గల పలు తెఱఁగుల విచిత్రములను జూచిరి. అచ్చటఁగల ప్రభువులచే మిగుల గౌరవింపఁబడి అచ్చటనుండి మఱలి ఇంగ్లండు వచ్చి చేరిరి.

ఆల్ఫ్రెడ్ జననము

1844 వ సంవత్సరము ఆగస్టునెల 6 వ తేది విక్టోరియా రాణిగారికి మఱియొక కుమారుఁడు కలిగెను. ఇతనికి ఆల్ఫ్రెడ్ అని నామకరణము కావించిరి. ఇతఁడు క్రమముగా పెరిఁగి పెద్దవాఁడై నావికసేనాధికారి యయ్యెను. ఇతనిని జంపుట కొకఁడు 1868 వ సంవత్సరమునందు నడుముపైని తుపాకిని కాల్చెను. అయినను చికిత్సచేసి గుండును వెలుపటికి తీసినందున బ్రతికెను. ఇతఁడు 1869 వ సంవత్సరమునందు ఇండియాను వచ్చి చూచిపోయెను. ఇతఁడు రష్యాచక్రవర్తి కొమార్తెను 1874 వ సంవత్సరమునందు పెండ్లియాడెను. ఈయన ఎడింబర్గు ప్రభువయ్యెను.

ఫ్రాన్సురాజు ఇంగ్లండునకు వచ్చుట

1844 వ సంవత్సరము అక్టోబరునెల ఫ్రెంచిదేశపురాజుగారు విక్టోర్యా రాణిగారిని సందర్శించుటకై లండన్ నగర

మునకు వచ్చిరి. రాణిగారు వారిని రాజ మర్యాదప్రకారము సత్కరించిరి. పిమ్మట రాజుగారు ఫ్రాన్సు దేశమునకు వెడలిపోయిరి.

స్వదేశ కలహములు

1844 వ సంవత్సరము మధ్యకాలమున ఐర్లాండునందును వేల్సునందును కలహములు జరుగ నారంభించినవి. అయినను వ్యర్థమైన కలహము లగుటచేత శీఘ్రకాలముననే అణగిపోయి దేశము నెమ్మదిపడినది.

క్షామము

ఆ సంవత్సరమునందే ఐర్లండు దేశమునందు క్షామము సంభవించెను. ఆ క్షామము క్రమముగా వృద్ధియగు చుండెనుగాని తగ్గలేదు. లక్షలకొలది జనులు అన్నము లేక అల్లాడుచుండినందున సర్కారువారును ధనికులును చాల ప్రయత్నించి ధన సహాయముచేసి కాపాడుచుండిరి. అయినను దొంగతనమును హత్యలును మెండుగా జరుగుచుండెను. ఈ కలవున కోర్వలేక పెక్కుమంది అమెరికా దేశమునకుఁ బోయిరి. ఈ క్షామనివృత్తికై సర్కారువారు సుమారు ఒకకోటి పౌనులు అప్పుతీసి వ్యయముచేసిరి. ఈ కలవు 1847 సంవత్సరమునుండి కొంచెము కొంచెముగా నివృత్తియగుటకు ప్రారంభ మయ్యెను.

ప్రష్యాదేశ ప్రయాణము

1844 వ సంవత్సరమునందు ఫ్రెంచిరాజు లండనునగరమునకువచ్చి స్వదేశమునకుఁ బోయినపిమ్మట విక్టోరియా రాణిగారు భర్తతోను పరివారముతోను బయలువెడలి ప్రష్యాదేశమునకుఁ బోయిరి. ఆ దేశపురాజు రాణిగారిని మిగుల సత్కరించెను. అక్కడనుండి రాణిగారు ఐర్లండునకుఁ బోవలయునని తలంచిరిగాని అచ్చట కలహము లణఁగియు అణఁగకయునుండినందున అచ్చటికి పోవక స్కాట్లండు దేశమునకేఁగి, అచ్చటనున్న బ్లేర్ అతాల్ అనెడి భవనమునందు నివసించియుండిరి. అచ్చటనుండిన కాలమునందు కిల్లి క్రాంకి అనెడి కనమయందుండు వంతెనను దాఁటునపుడు రాణిగారి బండి దొర్లిపడెనుకాని దేవుని దయవలననే యపాయమును కలుగలేదు.

రష్యా చక్రవర్తి ఇంగ్లండునకు వచ్చుట

1844–వ సంవత్సరమునందు రష్యా చక్రవర్తియైన నకోలస్ అనునతఁడు ఇంగ్లాండునకు వచ్చిరి కొన్నాళ్లు రాణిగారి నగరునందుండి, ఆమెవలన సత్కరింపఁబడుచుండెను. ఆ కాలమున నాతఁడు రాణిగారితోను, ఆమెకు మిత్రులుగానున్న పల్ ప్రభువు, ఆబర్డీప్రభువు మొదలైనవారితోను తుర్కీసుల్తాను చాల దుష్టుఁడనియును, క్రైస్తవులను పెట్టు

నట్టిబాధ చెప్పఁగరము కాదనియును వక్కాణించి వెడలి పోయెను. ఈతఁడు వచ్చిపోయినట్టి విషయమునుగూర్చి ముందు చెప్పఁబడును గనుక నిచ్చట విస్తరింపలేము.

హెలీనా జననము

1846-వ సంవత్సరము జూలై నెల 25-వ తేది రాణి గారికి కొమారిత కలిగెను. ఈమెకు ప్రిన్సస్ హెలీనా యని నామకరణము కావించిరి. ఈమెకు విద్యా బుద్ధులు శ్రద్ధతో నేర్పిరి. ఈమె తన ఇరువదియవ సంవత్సరమునందు ఆగస్టెన్‌బర్గు రాజపుత్త్రుఁడైన క్రిస్టియన్ అను నాతనిని వరించెను.

రాజద్రోహ కార్యములు

1848-వ సంవత్సరమునందు యూరపు ఖండమునం దంతటను ప్రజాపరిపాలనమునే ఏర్పఱుపవలయు నని జనులు ప్రయత్నములు చేసిరి. అప్పుడు ఫ్రాన్సు దేశమునందుఁ బుట్టిన సంక్షోభమునందు ఎందఱో తమ ప్రాణములను గాపాడుకొనుటకై స్వదేశమును విడిచిపెట్టి విదేశములకుఁ బోయిరి. ఫ్రాన్సురాజు మాఱువేషము దాల్చి 'స్మిత్తు' అని పేరు పెట్టుకొని కుటుంబముతోఁగూడ బయలుదేరి ఇంగ్లండు చేరెను. ఫ్రెంచిరాజు ఇంగ్లండు చేరకమునుపే రాణిగారు తమ మేనమామగారైన లియోపాల్డు ప్రభువుగారి పేర వ్రాసిన లేఖలో ,, ఫ్రాన్సుదేశపు రాజుయొక్కయు రాణి

యొక్కయు గతి యేమైనదో తెలియకున్నది: ఈకుటుంబమునకు మనచేత నైనంత సహాయము చేయవలసియున్నది. అయినను రాజుపక్షము నవలంబించి ప్రజలయొక్క నూతన పద్ధతికి విరోధముగా మనము ప్రవర్తించుటకు సాధ్యము కాదు. ప్రజలకు సమ్మతమైన పాలనాపద్ధతి యేర్పడినమీఁద మనము మన దేశక్షేమార్థమై వారిని సరియైన సరిహద్దులో నుంచుటకు ప్రయత్నము చేయవలయును'' అని వ్రాసినారు.

శరణార్థియై వచ్చిన లూయిస్ ఫిలిప్ అను ఫ్రెంచి చక్రవర్తిని, రాణిగారు మిగుల విశ్వాసముతో నాదరించిరి. ఇట్టి సమయముననే ఇటలి, స్పెయిన్, ఆస్ట్రియా, ప్రష్యా, మొదలగు దేశములందును ప్రజా సంక్షోభము కలిగెను. బెల్జియమునందును కలహము లంకురించెనుగాని, లియోపాల్డుగారి సత్పరిపాలనవలన కలహములు శీఘ్రముననే నివృత్తియాయెను. ఐర్లాండు దేశీయులును ప్రజా పరిపాలనమును కోరి కలహములు కావించిరి. ఇంగ్లండులోని ఆదాయము మీఁద పన్నును తగ్గింపవలయు ననియును, కూలీలకు జీతము హెచ్చు చేయవలయు ననియును కలహములు జరిగెను. అయినను ఆంగ్లేయ గవర్నమెంటువారు కలహముల నన్నిటిని అత్యల్ప కాలమునందే నివృత్తిచేయ నెంచినవారై, చక్కఁగా ఆలోచించి కలహమునకు మూలపురుషులైనవారిని బట్టి దండించిరి. అంతటితో కలహము లణఁగిపోయినవి.

లూయి జననము

1848-వ సంవత్సరము మార్చినెల 18-వ తేది విక్టోర్యా మహారాజ్ఞిగారికి కుమారిక కల్గెను. ఈమెకు ప్రిన్సస్ లూయి అను నామము నుంచిరి ఈమెను విద్యావంతురాలుగను, నీతిజ్ఞురాలుగను జేసిరి. ఈమె యుక్తవయస్సు వచ్చినతర్వాత, అనఁగా 1871-వ సంవత్సరమునందు లోర్న ప్రభువును వివాహము చేసికొనెను.

బాల్మోరల్ కోట

విక్టోర్యా మహారాజ్ఞిగారు స్కాట్లండు దేశములోని ఉన్నత ప్రదేశమునందు బాల్మోరల్ అను గిరిదుర్గము నొకదానిని క్రయమునకుఁ గొనిరి. ఈ ప్రదేశము ఏడుమైళ్ల పొడవును నాలుగుమైళ్ల వెడల్పును గల్గి యున్నది. ఈ కోట యొక ఏటియొడ్డున నున్నది. ఇది మిగుల చక్కఁగాను మంచిగాలి కలదిగాను నుండుటంబట్టి రాణిగారు తమ బిడ్డలను ఇచ్చట వసియింపఁజేసినచో వారికి ఆరోగ్యముగ నుండుటయేగాక, కొండలలో సంచరించుచు, జింకలను జూచుచు, అడవిచెట్లను వాని పువ్వులు కాయలు పండ్లు మొదలగువానిని గ్రహించుచు, వినోదముగాఁ బ్రొద్దుపుచ్చుచుందురని తలంచిరి. అట్లే రాణిగారు భర్తతోను బిడ్డలతోను ఇచ్చట కొంతకాలము వసించి సుఖముగా కాలము గడపుచుండిరి. ఇచ్చట రాణిగా రున్నపుడు బీదలకు చాల

సహాయము చేయుచుండిరి. రాజాంగ వ్యవహారములను కూడా నిర్వహించుచుండిరి.

ఘాతుక కృత్యము

రాణిగారు స్కాట్లండునందు సంచరించుచున్న కాలంబునందు భర్తయు బిడ్డలును బండినెక్కి విహారముకొఱకు బయట పోవుచుండుటకలదు. 1849-వ సంవత్సరము మే నెల 19-తేది రాణిగారు తమ ముగ్గురు బిడ్డలతోఁగూడ బండినెక్కి విహరించుటకు పోయియున్నపుడు విల్లియం హామిల్టన్ అను దురాత్ముఁడు రాణిగారిని గుఱిపెట్టి చేతితుపాకితో కాల్చెను. దైవాధీనముగా ఆగుండుదెబ్బ రాణిగారికిఁగాని బిడ్డలకుఁగాని తగులలేదు. ఇంతలో వాఁడు పట్టుకొనఁబడెను వెంటనే పోలీసువారువచ్చి చేరిరి. పోలీసువారు రాకున్నచో అచ్చట మూఁగినజనులు వానిని చంపివేసియుందురు. పిమ్మట వానిని విచారించి ఏడేండ్లు ద్వీపాంతరవాసశిక్ష విధించిరి.

ఐర్లాండుదేశ సంచారము

1849-వ సంవత్సరము ఆగస్టు నెల మహారాజ్ఞిగారును, భర్తయైన అల్బర్టు ప్రభువుగారును, నలుగురు బిడ్డలును ఐర్లండు దేశమునకుఁ బోయిరి. మఱియు డబ్లిన్, బెల్ఫాస్టర్ మొదలగు స్థలములను జూచికొని, అచ్చటనుండి బయలుదేరి స్కాట్లండు దేశముచేరి అచ్చట సుమారు ఆఱు వారము

లుండిరి. ఆసమయమునందు లండన్ నగరమున విషూచి వ్యాధి మెండుగా నుండెను. అనేకులు మృతినొందిరి.

ఆర్థరు జననము

1850-వ సంవత్సరము మే నెల 1 తేది విక్టోర్యా రాణి గారికి తృతీయపుత్రి జనన మైనది. ఇతనికి ఆరన్ విల్లియం ఫ్రెడరిక్ ఆల్బర్టు అని నామకరణము చేసిరి. ఇతఁడే కెన్నాట్ ప్రభువు అనఁబడువారు. కెన్నాట్ ప్రభువు 1879-వ సంవత్సరమునందు ప్రిష్యాదేశపు రాజకుమారికయైన లూయి అను నామెను వివాహమాడెను. ఇతఁడు మన హిందూదేశమునందుండి బొంబాయి రాజధానిలోని సైన్యమునకంతయు ముఖ్య సేనాధిపతిగా నుండెను.

లెప్టినెంటు పేట్ గండింపఁబడుట

ఆర్థరు పుట్టిన ఒక నెలకుమీఁద రాణిగారు తమ పిన తండ్రిగారైన డ్యూక్ ఆఫ్ కేంబ్రిడ్జి అను నతఁడు వ్యాధి పీడితుఁడై యుండినందున, ఆయనయొక్క క్షేమమును విచారించుటకై బయలుదేరిపోయి ఆయనను జూచికొని మఱలివచ్చి బండినెక్కెడి సమయమునందు లెప్టినెంటు పేట్ అనువాఁడు పఱుగిడివచ్చి తన చేతనున్న బెత్తముతో మహారాజ్ఞిగారిని తలపై కొట్టెను. ఆదెబ్బ తలమీఁదనున్నటోపిపై తగిలినందున ఎక్కువ అపాయము కలుగలేదుగాని, గాయము

మాత్రమైనది. పిమ్మట వానిని పట్టుకొని విచారింపఁగా, వాఁడేదియుఁ జెప్పలేదు. కొందఱు వానికి చిత్తచాంచల్య మనిరిగాని ధర్మాధికారులు ఆవాదము నంగీకరింపక ఏడు సంవత్సరములు ద్వీపాంతరవాస శిక్ష విధించిరి.

వస్తుప్రదర్శనము

1851-వ సంవత్సరము మేనెల 1 తేది ఆల్బర్టు ప్రభువు గారి ప్రయత్నముచేత లండన్ నగరములోని జనోద్యానము నందు గొప్పప్రదర్శన మొకటి కావింపఁబడెను. ఆవస్తు ప్రదర్శనశాల సుమారు 21,000 అడుగుల పొడవును, 400 అడుగులవెడల్పును గలదై యుండెను. ఈవినోదశాలా మందిరము ఇనుపకమ్ములతోను అద్దములతోను కట్టఁబడెను. ఇది కట్టిముగియుటకు ఆఱుమాసము లైనవి.



1851-వ సంవత్సరపు వస్తుప్రదర్శన శాల

ఈ వినోదశాలలో లోకములోఁ గల సకలమైన విశేష వస్తువులుంపఁబడెను. సకలదేశములవారునువచ్చి చూచుటకు వలసిన యేర్పాట్లు చేయఁబడెను. ఇందువలన పరస్పరము

ఐకమత్యమును వ్యాపారవృద్ధియు నగునని ఆల్బర్టుగారు సూచించిరి. ఈ శాలాభవనమునందు వస్తువు లుంచుటకుఁ దగిన చోటుగాక యిరువదివేల జనులు కూర్చుండుటకు వసతు లేర్పాటు చేయఁబడియుండెను. ఈ ప్రదర్శనమందిరమును మే నెల 1 తేది రాణిగారు భర్తతోను పెద్దకుమారునితోను కుమారితతోను గూడి ప్రథమమున ప్రవేశించిరి. లోపల కూర్చుండుటకు ఇరువదియైదు వేలమందికే చోటుండినందున బయట ఏడులక్షల జనులు నిలబడియుండిరి. రాణిగారు వస్తుప్రదర్శన మందిరమును ప్రవేశించునపుడు సకలజనులును రాజదంపతులను అభినందించిరి. ఈ సభ అక్టోబరు నెల 15-వ తేదివఱకు జరిగెను. ఇదివఱ కెన్నియో వస్తుప్రదర్శన సభలు జరిగినవిగాని, యిట్టి వినోద వస్తుప్రదర్శన సభ యెప్పుడును జరిగినది లేదు. ఈ సభకు ఏయే దేశములలో నుండి వస్తువులు వచ్చియుండినవో, ఆయా దేశస్థుల రాజపతాకలును ఎగురుచుండినవి. ఈ వినోదమును జూచినవారి సంఖ్య అఱువదిరెండులక్షలు. వారివలని పోగైనసొమ్ము అయిదులక్షల కాసులు.

లూయి నెపోలియన్ ఫ్రాన్సుచక్రవర్తి యగుట

ఇదివఱకే ఫ్రాన్సు దేశాధిపతి లూయి నెపోలియన్ అనువారు ప్రచ్ఛన్న వేషముతో కుటుంబ సహితముగా ఆంగ్లేయుల శరణు చొచ్చినారని చెప్పియున్నాముకదా.

ఆయన ఆంగ్లేయ రాజ్యాంగమువారి దయచేత 1851-వ సంవత్సరము కడపట ఫ్రాన్సుదేశముమీఁద దండెత్తిపోయి, పారీసు నగరమునందు ఘోరమైన యుద్ధముచేసి ప్రజాపాలనమును సమూలముగా నాశనముచేసి వారే చక్రవర్తియై ఇరువది సంవత్సరములు రాజ్యము చేసిరి. ఆయన రాజ్యము నేలిన యిరువది యేండ్లదాఁక ఆంగ్లేయులయెడల చాల విశ్వాసము గలవారై వర్తించుచుండిరి.

కొన్ని నష్టములు

1852-వ సంవత్సరము జనవరినెల అమేసాన్ అనెడి ఆంగ్లేయ నావ కాలినందున 140 గురు మృతి నొందిరి. బర్కెన్‌హెడ్ అనెడి ఓడ మునిఁగినందున 436 గురు గతించిరి. ఇంగ్లండునందు హొలాంబర్తు అను ప్రదేశమునకు సమీపమునం దున్న గుంటగట్టు పగిలినందున సుమారు 100 గురు నీటఁబడి కూలిరి. అందువలన ఇండ్లు వాకిండ్లు పోఁగొట్టుకొన్నవారు సుమారు ఏడువేల జనులుందురు. ఇట్టి ఆపదలకు లోనైనవారలకెల్ల విక్టోర్యారాజ్ఞిగారు చాలా సహాయము చేసి రక్షించిరి.

వెల్లింగ్టన్ ప్రభువుగారి మరణము

1852-వ సంవత్సరము సెప్టంబరు నెలలో డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ అనువారు తమ 83-వ సంవత్సరమునందు

పరలోకవాసులైరి. రాణిగారు చాల విచారగ్రస్తులైరి. ఆయన శవమువెంట ఆల్బర్టు ప్రభువుగారును, మంత్రులును సేనాధిపతులును, తక్కిన ప్రముఖులును సమాధిస్థలమువఱకేఁగి ఖననముచేసి చాల వ్యసనముతో మఱలి వచ్చిరి.

లియోపాల్డు జననము

1853-వ సం. ఏప్రెల్ నెల 7-వ తేది రాణిగారికి నాలవ పుత్త్రుఁడు పుట్టెను. ఇతనికి లియోపాల్డు అని పేరిడిరి. క్రమముగా విద్యావంతుఁడాయెను. ఇతఁడు సకల విధముల యందును తండ్రినిఁబోలియుండెనుగాని చాల బలహీనుఁడుగా నుండెను. ఈయన ఆల్బని ప్రభువుగా నియమింపఁబడెను. ఇతఁడు 1882-వ సంవత్సరమునందు హెలీనా అను రాజకుమారికను వరించెను. ఈమెవలన నొక కుమార్తె కలిగెను. పిమ్మట గర్భిణిగా నున్నపుడే లియోపాల్డుగారు 1884-వ సంవత్సరమున లోకాంతరగతుఁడాయెను. అనివతికే గర్భవతిగా నున్న యీతనిపత్ని కుమారునిం గనెను.

క్రిమియా యుద్ధము

రష్యా చక్రవర్తి లండను నగరమునకు వచ్చిపోయిరని మున్ను వివరింపఁబడియెనుకదా ? అతఁడు లండను నగరమునందున్న కాలమునందు ఆంగ్లేయులను జయించుట సులభమనియు, తనతో నెదురించి యుద్ధము చేయరనియు తెలిసి

కొనెను. ఇట్లీతఁడు గ్రహించినది తెలివిలేమియోగాని వేఱు కాదు. అయినను ఈతఁ డెంచిన యెన్నికను నెఱవేర్చుకొను తలంపుచేతనే కాఁబోలు 1853-వ సంవత్సరమునందు తుర్కీదేశముపై దండెత్తెను. ఇతఁడు క్రీస్తువులకు మేలు చేయుటకై తురుష్కులపై దాడివెడలినట్లుగా అభినయించి నప్పటికిని అది వాస్తవము కాదు. ఆతని అభిప్రాయ మేమనఁగా, తుర్కీదేశమును దాని రాజధానియైన కాన్‌స్టాంటినోపిల్ పట్టణమును స్వాధీనము చేసికొని పిమ్మట నల్లసముద్రముపై అధికారమును వహించి క్రమముగా తాను చాల కాలమునుండి కనుపెట్టియున్న యిండియా దేశమున ప్రవేశింపవలయు ననియేగాని వేఱుకాదు. అయినను రష్యా చక్రవర్తి కంటెను అతని పరిజనులకంటెను ఎక్కువ తెలివిగల ఆంగ్లేయులు ఆతని కోర్కిని యెఱింగి దానికిఁ దగిన ప్రతిక్రియ నాలోచించుచుండిరి. ఈలోపల తుర్కీ దేశము రష్యావారి స్వాధీన మయ్యెను. మఱియు రష్యావారి యుద్ధనావ యొకటి సైనోప్ రేవులో జొచ్చి అచ్చట నిలిచి యున్న తుర్కియోడలను పగులఁగొట్టి సుమారు ఐదువేల జనులను ముంచివేసెను. ఈవృత్తాంతము ఇంగ్లండునకుఁ దెలిసినవెంటనే విక్టోర్యా రాజ్ఞిగారు రష్యావారితో యుద్ధము చేయవలయునని ఆజ్ఞ చేసిరి. అపుడు ఫ్రెంచివారును ఆంగ్లేయులకు సహాయముగా యుద్ధనావలను బంపిరి. బ్రిటిష్ ఓడలును